తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
10 మే 2026
సంపుటి 03
సంచిక 212
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## హైదరాబాద్‌ను వణికిస్తున్న
# నేపాలీ ముఠాలు




- పనిమనుషుల పేరుతో ఇళ్లలోకి ప్రవేశం
- జూబ్లీహిల్స్, నందగిరి హిల్స్‌లో వరుస హత్యలు, దోపిడీలు
- 'ఆపరేషన్ నేపాల్'తో రంగంలోకి దిగిన పోలీసులు

హైదరాబాద్, మే 9 హైదరాబాద్‌లోని సంపన్న ప్రాంతాలు జూబ్లీహిల్స్, నందగిరి హిల్స్‌లో వరుసగా జరుగుతున్న హత్యలు, భారీ దోపిడీలు నగర ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పనిమనుషుల రూపంలో ఇళ్లలోకి ప్రవేశిస్తున్న కొందరు నేపాలీ ముఠాలు విశ్వాసానికి వెన్నుపోటు పొడుస్తూ పక్కా ప్రణాళికలతో నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గత మూడు నెలల్లో చోటుచేసుకున్న మూడు ప్రధాన ఘటనలు నగరంలో తీవ్ర కలకలం రేపాయి. ఫిబ్రవరి 6న నందగిరి హిల్స్‌లో ఓ వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువకుడు ఇతర పనివారికి మత్తుమందు ఇచ్చి దాదాపు రూ. 2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. మార్చి 14న జూబ్లీహిల్స్‌లో మరో వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న ఇద్దరు నేపాలీలు యజమాని లేని సమయంలో లాకర్లు పగులగొట్టి రూ. 3 కోట్ల విలువైన నగలను దోచుకెళ్లారు. తాజాగా మే 8న ఓ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువతి యజమాని భార్యను హత్య చేసి నగదు, నగలతో పరారైన ఘటన మరింత సంచలనం సృష్టించింది. ఈ మూడు ఘటనల వెనుక ఒకే ముఠా పని తీరు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

➤ మిగతా 2వ పేజిలో..



## తెలంగాణ వాహనదారులకు భారీ ఊరట

- డ్రైవింగ్ లైసెన్స్ సేవలు పూర్తిగా ఆన్‌లైన్
- 17 రకాల సేవలకు ఫేస్‌లెస్ విధానం
- ఇంటి నుంచే సేవలు పొందే అవకాశం

హైదరాబాద్, మే 9 తెలంగాణలో వాహనదారులకు రాష్ట్ర రవాణా శాఖ భారీ ఊరట కల్పించింది. డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన 17 రకాల సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తూ 'ఫేస్‌లెస్' విధానాన్ని ప్రారంభించింది. ఇకపై చిన్నచిన్న పనుల కోసం ఆర్టీవో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె ఇలంబర్తి మాట్లాడుతూ ఆధార్ ధ్రువీకరణ ద్వారా ఇంటి నుంచే ఈ సేవలను పొందవచ్చని వెల్లడించారు. పారదర్శకత పెంపు, సేవలను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.ఈ కొత్త విధానం ద్వారా లెర్నర్ లైసెన్స్‌లో పేరు, చిరునామా, ఫొటో, సంతకం మార్పులు, డూప్లికేట్ లెర్నర్ లైసెన్స్ జారీ వంటి సేవలను సులభంగా పొందవచ్చు.

➤ మిగతా 2వ పేజిలో..



## శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలను సాకారం చేస్తాం: మోదీ

- బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వంపై హర్షం
- మఖన్‌లాల్ సర్కార్ సేవలను కొనియాడిన ప్రధాని
- పార్టీ బలోపేతానికి కృషి చేసిన నేతలకు ప్రశంసలు

కోల్‌కతా, మే 9: పశ్చిమ బెంగాల్‌లో తొలి బీజేపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకోవడం సహజమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన కలలను సాకారం చేయడానికి ఎలాంటి ప్రయత్నాన్నీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. లక్ష్యంగా కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ నాయకత్వం వెల్లడిస్తోంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. బెంగాల్ రాజకీయాల్లో ఈ పరిణామం కొత్త మార్పులకు దారితీస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

➤ మిగతా 2వ పేజిలో..

# ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్
## లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు

- కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి బహుళ ప్రణాళికలు
- మూసీ పునరుజ్జీవంతో కాలుష్య నియంత్రణపై దృష్టి
- తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ



హైదరాబాద్, మే 9 ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని నగరాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పెరుగుతున్న నగరీకరణతో భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్న ముఖ్యమంత్రి, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తుగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు కీలక ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు,

➤ మిగతా 2వ పేజిలో..

## బీజేపీని ఓడించేందుకు విపక్షాలన్నీ ఏకం కావాలి



- మమత పిలుపు
- బీజేపీయే తొలి శత్రువని వ్యాఖ్య
- విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు పిలుపు
- బంగాల్‌లో టీఎంసీ కార్యకర్తలపై దాడుల ఆరోపణ


➤ 2వ పేజిలో..

## రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోంది: హరీశ్ రావు

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలపై తీవ్ర ఆగ్రహం
- సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యమని విమర్శ
- తరుగులు, బీ-గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్న ఆరోపణ

➤ 2వ పేజిలో..

## ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం



➤ 2వ పేజిలో..

# హైదరాబాద్‌ను వణికిస్తున్న నేపాలీ ముఠాలు

ముందుగా ధనిక కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని పనివాళ్లుగా ఇళ్లలో చేరుతున్న నిందితులు, కొద్ది రోజుల పాటు నమ్మకంగా పనిచేస్తూ ఇంట్లోని పరిస్థితులు, నగదు, నగలు ఎక్కడ దాచారన్న సమాచారాన్ని సేకరిస్తున్నట్లు విచారణలో తేలింది. యజమానులు ఊరికి వెళ్లిన సమయంలో లేదా ఏమరపాటుగా ఉన్న సమయంలో తమ అనుచరులతో కలిసి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుల్లో అరెస్టయిన నిందితుల విచారణలో నేపాల్‌లో ఉన్న కొందరు మాస్టర్‌మైండ్‌ల పాత్ర బయటపడినట్లు సమాచారం. పనికి వెళ్లే వ్యక్తులను ఎంపిక చేయడం నుంచి దోపిడీ తర్వాత ఎలా తప్పించుకోవాలో వరకు అక్కడి నుంచే మార్గనిర్దేశం చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దోపిడీల అనంతరం పుణె, ముంబై వంటి నగరాలను తాత్కాలిక ఆశ్రయాలుగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో నగరాన్ని వణికించిన ముఖియా గ్యాంగ్ తరహాలోనే ఇప్పుడు ఈ నేపాలీ ముఠాలు కూడా పోలీసులకు కొత్త సవాలుగా మారాయి. ఈ ఘటనల నేపథ్యంలో నగర పోలీసులు 'ఆపరేషన్ నేపాల్' పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు రాష్ట్రాల మధ్య సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నారు.

## తెలంగాణ వాహనదారులకు భారీ ఊరట

అలాగే డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, డూప్లికేట్ లైసెన్స్, పుట్టిన తేదీ మార్పు, బయోమెట్రిక్ వివరాల సవరణ వంటి కీలక సేవలను కూడా ఫేస్‌లెస్ పద్ధతిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రమాదకర వ్యర్థాల రవాణాకు అవసరమైన హజార్డస్ లైసెన్స్ ఎండార్స్‌మెంట్, డూప్లికేట్ పీఎస్‌వీ బ్యాడ్జ్ జారీ, లైసెన్స్ నుంచి వాహన విభాగాల తొలగింపు వంటి సేవలు కూడా ఆన్‌లైన్‌లో అందనున్నాయి. ఈ సేవలను పొందడానికి పౌరులు అధికారిక 'సారథి' వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో డిజిటల్ పాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగానే ఈ ఫేస్‌లెస్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉన్న ఈ సేవలను త్వరలోనే 'నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్' మొబైల్ యాప్‌లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ మార్పులతో ప్రజలకు సమయం, శ్రమ ఆదా అవుతుందని రవాణా శాఖ తెలిపింది.

# ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు





పెరుగుతున్న నగరీకరణతో భవిష్యత్తులో మరిన్ని సవాళు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్న ముఖ్యమంత్రి, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తుగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు కీలక ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, ఉపరితల రహదారుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.
కేవలం రోడ్ల విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యలు తగ్గవని, బహుళ రవాణా విధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. నగరంలో పార్కింగ్ సమస్యలను తగ్గించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడానికి ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని సీఐయూఆర్, పీఐయూఆర్, ఆర్ఏఆర్‌ఈ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని తయారీ రంగ అభివృద్ధికి అనుకూల ప్రాంతంగా, ఆ తర్వాతి గ్రామీణ ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.
మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌ను కాలుష్య సమస్యల నుంచి కాపాడటంతో పాటు నగర సంస్కృతితో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. నగరంలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టడమే కాకుండా ఆటోలను ఉచితంగా ఈవీ వాహనాలుగా మార్చే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో హైదరాబాద్ తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం వంటి అంశాలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు దేశంలోనే విప్లవాత్మక కార్యక్రమమని స్టాండింగ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు ముఖ్యమంత్రి అందజేశారు.

# రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోంది: హరీశ్ రావు



సిద్దిపేట, మే 9 సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో 40 రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతుల పరిస్థితిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, వడగండ్ల వానలతో రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా వారాల తరబడి కేంద్రాల వద్దే ఉండాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. రైతుల బాధలపై ప్రభుత్వానికి కనీస స్పందన లేదని విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని హరీశ్ రావు విమర్శించారు. బోనస్ ఎగ్గొట్టడమే కాకుండా తరుగులు, బీ-గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. చిన్నకోడూరులో సన్ ఫ్లవర్ కొనుగోళ్లు నిలిపివేయడంతో కుప్పల కింద పంట చెడిపోతోందన్నారు. మద్దతు ధర రూ. 7,720 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ. 5 వేలకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు ఎకరాకు వేల రూపాయలు నష్టపోతున్నారని చెప్పారు. రైతుబంధు లేక, మద్దతు ధర అందక రైతులు అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో గత నాలుగు రోజులుగా నిల్వలు పేరుకుపోయి లారీలు లేక పంటలను లోపలికి అనుమతించడం లేదని హరీశ్ రావు అన్నారు. ఒక రైతు పంట అమ్ముకోవాలంటే తేమ పరీక్షకు వారం, సంచుల కోసం వారం, కాంటాకు వారం, లారీల కోసం వారం ఇలా నెల రోజుల పాటు కల్లాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రైతులను ఆదుకోని ప్రభుత్వం ప్రజల నమ్మకం కోల్పోతుందని హరీశ్ రావు హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లపై ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వరి కోతలు ప్రారంభమయ్యే ముందే మంత్రులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి సంచులు, లారీలు, నిధులు సిద్ధం చేసేవారని గుర్తు చేశారు. రైతులను కంటికి రెప్పలా కాపాడిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. చిన్నకోడూరు ప్రాంతంలో రైతులు ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల సన్ ఫ్లవర్ దిగుబడి సాధిస్తున్నప్పటికీ కేవలం ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టిందని విమర్శించారు. తీరా ఆ పరిమితి మేరకు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కోటా ముగిసిందనే కారణాలు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పొద్దున్న లేస్తే పంటల మార్పిడి చేయాలని రైతులకు సూచించే ప్రభుత్వం, రైతులు సన్ ఫ్లవర్, మక్కలు, శనగలు, జొన్నలు పండిస్తే వాటిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవైపు పంటల మార్పిడి చేయమని చెప్పి, మరోవైపు ఆ పంటలను కొనకుండా రైతులను నష్టాల్లోకి నెట్టడం ద్వంద్వ వైఖరి కాదా అని విమర్శించారు. జొన్న పంటను గతంలో ప్రతి ఏడాది కొనుగోలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం జొన్నలు కొనడం లేదని, సన్ ఫ్లవర్ కొనుగోళు పూర్తిగా ఆపేసిందని ఆరోపించారు. మక్కలకు కూడా పరిమితులు విధించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సంచులు కూడా రైతులే తెచ్చుకోవాలని చెప్పడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. రైతులకు సంచులు సరఫరా చేసే సామర్థ్యం లేని ప్రభుత్వం ఢిల్లీ పర్యటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా ఒక్కసారి కూడా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినలేదని అన్నారు. వడ్లను రైస్ మిల్లులు తీసుకోవడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు కిలో తరుగు వేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. బీ-గ్రేడ్ పేరుతో ఎకరాకు వందల రూపాయల నష్టం వస్తోందన్నారు. ఒకవైపు తరుగులు, మరోవైపు మిల్లుల్లో కటింగ్స్‌తో రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం





- బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ఘన కార్యక్రమం
- మోదీ సమక్షంలో బాధ్యతలు చేపట్టిన సువేందు
- మమతా ఆధిపత్యానికి ముగింపు పలికిన ఎన్నికలు

కోల్‌కతా, మే 9 పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపు చోటుచేసుకుంది. భారతీయ జనతా పార్టీ తరఫున తొలి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వాతంత్ర్యం తర్వాత బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నేతలు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే భారీగా పార్టీ కార్యకర్తలు, ప్రజలు అక్కడికి చేరుకున్నారు. బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందంటూ బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు.
ప్రమాణ స్వీకారం అనంతరం సువేందు అధికారి ప్రధానమంత్రి మోదీ ఆశీస్సులు తీసుకున్నారు. వేదికపై ఉన్న జాతీయ నాయకులతో కరచాలనం చేశారు. బెంగాల్ అభివృద్ధి, పరిపాలనలో కొత్త దిశగా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 294 స్థానాల్లో 207 స్థానాలు గెలుచుకుని ఘన విజయం సాధించింది. పదిహేనేళ్లుగా కొనసాగుతున్న తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు ముగింపు పలికాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధిపత్యానికి గండి పడడంతో బెంగాల్ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. సువేందు అధికారి ప్రస్తుతం బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిదో వ్యక్తిగా నిలిచారు. ఆయన వయస్సు 55 సంవత్సరాలు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయనకు గట్టి పట్టు ఉంది. ఆయన తండ్రి సిసిర్ అధికారి గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. విద్యార్థి దశలో కాంగ్రెస్ విద్యార్థి విభాగం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సువేందు, అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సువేందు అధికారి తర్వాత కాలంలో ఆమెకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా మారారు. నందిగ్రామ్ రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యం మరింత పెరిగింది. రెండు సార్లు మమతాపై పోటీ చేసి విజయం సాధించిన ఆయన ఇప్పుడు రాష్ట్ర అత్యున్నత పదవిని అధిరోహించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## బీజేపీని ఓడించేందుకు విపక్షాలన్నీ ఏకం కావాలి

కోల్‌కతా, మే 9 పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి అధికారంలోకి వచ్చిన బీజేపీని ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా ఉన్న విపక్షాలన్నీ ఏకం కావాలని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలతో పాటు బీజేపీని వ్యతిరేకించే విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా కోల్‌కతాలోని కాళీఘాట్ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మమత మాట్లాడారు. బీజేపీయే తమకు మొదటి శత్రువని, ఆ పార్టీని ఎదుర్కొనేందుకు ఎవరితోనైనా చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని మమత ఆరోపించారు. బీజేపీ శ్రేణుల్లోకి సంఘ విద్రోహ శక్తులు ప్రవేశించి రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన వెంటనే తమకు కల్పించిన భద్రతను ఉపసంహరించుకున్నారని మమత ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న పలువురు విపక్ష నేతలు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి రోజే టీఎంసీ కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తోందని మమత ప్రకటించారు. భవిష్యత్తులో బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో మమత తన ఓటమిని పరోక్షంగా అంగీకరించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం కావడంతో ఆమె తన ఎక్స్ ఖాతా బయోను కూడా మార్చుకున్నారు. తన ఎక్స్ బయోలో "అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, బంగాల్ ముఖ్యమంత్రి (15,16,17వ విధానసభ)" అని మార్చుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల జరిగిన ఎన్నికలపై కూడా మమత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము బీజేపీతో కాకుండా ఎన్నికల సంఘంతో పోరాడామని ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. ప్రజా తీర్పు వల్ల కాకుండా కుట్రల కారణంగానే తమ ఓటమి జరిగిందని మమత ఆరోపించారు.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 10 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుకోవద్దు

## కో - ఆప్షన్ సభ్యుడు మడుగుసాంబమూర్తి



**ఇల్లందు ప్రతినిధి మే 9, (తరంగాలు):** శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత ప్రజలకు అవసరమైన మౌలిక, వ్యక్తిగత అవసరాలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి గుర్తు చేశారు. ప్రజాసేవకు అధికారమే అవసరం లేదు, రాజకీయాలలో, సామాజిక సేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రజా అవసరాలను గుర్తించి వారికి అవసరమైన అన్నిటిని సాధ్యమైనంతవరకు వారికి అందేలా చూడటమే కర్తవ్యంగా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. కానీ ఆ విషయాలను మరచి తన వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నించడం స్థానిక 13 వ వార్డ్ కౌన్సిలర్ కు అలవాటుగా మారిందని ఎద్దేవ చేశారు. ప్రజల బలహీనతలను ఆసరా చేసుకుని, క్షుద్ర పూజలు చేయడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం, ఆరోగ్యాలు బాగు చేస్తామని, ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని, వాటిని బయటకు తీస్తానని లక్షల దండుకుని మోసం చేయడం కొందరికి నిత్య కృత్యంగా మారిందనే విషయం అందరికి తెలిసిందేనన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య గెలిచిన తర్వాత తన విధులను మరచి ఇతరులు చేస్తున్న మంచిని జీర్ణించుకోలేక తన కుటుంబ సభ్యులపై అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుకుంటున్నాడని పేర్కొన్నారు. తనకు చేతగాని పనిని ఇతరులు చేస్తే తట్టుకోలేక చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాజకీయంగా తనతో విభేదిస్తున్న కొంతమందిని అక్కున చేర్చుకొని, ఆరోపణలు చేయడం ఇకనైనా మానుకోవాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఒకరి పై బురదజల్లే ప్రయత్నం చెయ్యరాదు అన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టిస్తారించలని ఆయన హితవు పలికారు.

# ఖమ్మం జిల్లా యాదవులకు నామినేటెడ్ పదువుల విషయంలో తీవ్ర అన్యాయం

- ఈ విషయమై ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రుల్ని కలుస్తాం
- అవసరమైతే ఆందోళన కార్యక్రమం చేపడతాం
- పత్రికా విలేకరుల సమావేశంలో అఖిలభారత యాదవ మహాసభ నాయకులు



**ఇల్లందు ప్రతినిధి మే 9, ( తరంగాలు):** శనివారం నాడు ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయం లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, రాష్ట్ర ఉద్యోగుల విభాగం సంఘం నాయకులు దుబాకుల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా బిసి కులాలలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు రాజకీయ పదవుల విషయంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వం హయాంలో కనీసం ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ ఎంపీ, రెండు ఎమ్మెల్సీలు ఒక మంత్రి పదవి, కార్పొరేషన్ చైర్మన్లు డిసిసిబి చైర్మన్ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉండి పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన యాదవులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం జరిగిందని, ఇప్పటివరకు యాదవులకు ఖమ్మం జిల్లా నుండి రాష్ట్రస్థాయి నామినేట్ పదవిని ఇవ్వలేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వమైనా కేటాయిస్తారని ఆశించామని తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన వ్యక్తి, 30 సంవత్సరములకు పైగా రాజకీయాల్లో ఉండి, యాదవులకొరకు , గొర్రెల సంఘాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు, మాజీ జడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ 2023 లో జరిగిన ఎన్నికల లో జిల్లా మొత్తం పర్యటించి యాదవుల ప్రజా సమావేశాలు నిర్వహించి, యాదవులను కాంగ్రెస్ పార్టీ వైపు మళ్ళించటానికి ఎంతో ప్రయత్నం చేశారని, ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు 57 రోజులు జైలు జీవితం కూడా గడిపారని ఆర్థికంగా, మానసికంగా, కుటుంబ పరంగా ఎంతో నష్ట పోవడం జరిగిందని ఈ విషయం జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రులకు తెలుసని, పేర్కొన్నారు. మా యాదవులకు ఇలాంటి అన్యాయం జరిగితే సహించబోమని, కేవలం రాజకీయ స్వార్థం కోసం, ఓట్ల కోసం మల్లి బాబు యాదవ్ ను, యాదవ సంఘం నాయకులను ఉపయోగించుకున్నారని, ఈ విషయమై ముగ్గురు మంత్రులను కలిసి విన్నవిస్తామని, అవసరమైతే జిల్లాలోని యాదవులంతా ఏకమయ్యి ఆందోళన కార్యక్రమం కూడా చేపడతామని హెచ్చరించారు. వీళ్ళు గొర్రెలు కాచుకునే వాళ్లు కదా, అని చులకనగా చూడవద్దని , సాధ్యమైనంత త్వరలో ఈ సమస్య ను పరిష్కరిస్తారని తెలిపారు . ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షురాలు కనక బండి విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మొరిమేకల కోటయ్య, సత్తి వెంకన్న,తెల్లబోయిన రమణ, తోడేటి లింగరాజు, పొదిల భూపతి, వాకదానివల రాజు, రాగం బాబురావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ మాత్రమే





- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న గంట సంజీవ రెడ్డి ,అల్లం రమ-నాగేశ్వర్ రావు

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 0 9, తరంగాలు:**కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డు లక్ష్మీ నగర్ కి చెందిన తుర్క రాధమ్మ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం వేడుకల్లో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి,కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ పేదవారికి పక్కా గృహాలు నిర్మించి వారి సొంతింటి కల నెరవేరుస్తుంది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని అది ప్రజా ప్రభుత్వం ద్వారా సాధ్యం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న,జిల్లా ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి, కౌన్సిలరులు ధారావత్ కిషోర్, వీరేష్ యాదవ్,బండి సుజాత ప్రభాకర్,శ్రీరామ్ కిరణ్,వెంకన్న, స్థానికులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు ఉన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మే. 09, తరంగాలు:**కేసముద్రం మున్సిపాలిటీ 2వ వార్డ్ రేకులతండా కి చెందిన తేజవత్ బాల్ సింగ్ - హచ్చి కుమార్తె పల్లవి - నరేష్ ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి శ్రీ బానోత్ సునీత వెంకన్న.ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్స్ కిషోర్, వీరష్ మార్కెట్ మార్కటే డైరెక్టర్ అయూబ్ ఖాన్,మహేష్ రగడ, శ్రీను, మహేష్, వీరు,సోమ్లా, కుమార్, రంగా,శ్రీకాంత్,వెంకన్న, దుర్గప్రసాద్,సిద్దు, సందీప్, అరుణ్ అనిల్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ మే 9**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై సమీక్ష జరిగింది.ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని, సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు గడువు తక్కువగా ఉండటంతో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ స్వీయ గణన పూర్తి చేసుకోవాలని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 11 నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ, ధాన్యం కొనుగోలు, సెన్సస్ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. విద్యా వారోత్సవాలను ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

# ప్రాణాలతో ఆటలాడుతున్న కొత్త రోడ్డు ఇరువైపుల మట్టి లేక ప్రమాదాలకు ఆహ్వానం



**కారేపల్లి టౌన్ తరంగాలు న్యూస్ మే 9**

సింగరేణి మండలం నుండి పేరుపల్లి వెళ్లే మార్గంలో ఇటీవల నిర్మించిన కొత్త వంతెన రోడ్డు ప్రస్తుతం ప్రయాణికులకు ప్రాణహానిగా మారింది. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ రహదారికి ఇరువైపుల మట్టి నింపకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న తప్పిదం జరిగినా వాహనాలు రోడ్డు పక్కకు జారిపడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, రైతులు భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పుకుంటున్నప్పటికీ, భద్రతా చర్యలను పూర్తిగా గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు ఎత్తుగా ఉండగా, పక్క భాగాల్లో మట్టి నింపకపోవడం వల్ల ప్రమాదాలకు అవకాశం పెరిగిందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాహనాలు అదుపుతప్పిన ఘటనలు జరిగినట్లు సమాచారం."పని పూర్తి చేశామనే పేరుకే రోడ్డు వేశారు... ప్రజల ప్రాణాల భద్రత ఎవరి బాధ్యత?" అంటూ స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా రోడ్లు ఢ భవనాల శాఖ అధికారులు, డివిజన్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు ఇరువైపుల మట్టి నింపే పనులు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే పెద్ద ప్రమాదం జరిగిన తర్వాతే స్పందిస్తారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# పదవి లేకపోయినా ప్రజాసేవే లక్ష్యం పోలంపల్లి తండా అభివృద్ధికి ధోని నాయక్ కృషి



**కారేపల్లి టౌన్ తరంగాలు న్యూస్ మే 9**

సింగరేణి మండలంలోని పోలంపల్లి తండా గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని యువ సామాజిక సేవకుడు ధోని నాయక్ తెలిపారు. ఎలాంటి రాజకీయ పదవి లేకపోయినా గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సి ఎస్ ఆర్ నిధుల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.గ్రామంలో సోలార్ లైట్ల ఏర్పాటు, పోలంపల్లి నుండి వెళ్లే రహదారి మరమ్మతులు చేయించడం, సింగరేణి సంస్థలోని సోలార్ పవర్ ప్లాంట్‌లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు చెప్పారు.


గ్రామంలో ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సి ఎస్ ఆర్ నిధులను వినియోగించాలని అధికారులను కోరినట్లు ధోని నాయక్ వెల్లడించారు. అతి త్వరలోనే గ్రామానికి ఆర్ ఓ ప్లాంట్ కూడా మంజూరు కానుందని, దీని ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, మంత్రి సలహాలు మరియు మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతానని ధోని నాయక్ తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఆయన సేవా కార్యక్రమాలను అభినందిస్తున్నారు.

## అక్షర్ పటేల్ బ్యాటింగ్ వైఫల్యం..



ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ పరిస్థితి అగమ్యగో చరంగా మారింది. ముఖ్యంగా ఆ జట్టు సారథి అక్షర్ పటేల్ బ్యాటింగ్ ఫామ్ టీమ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. శుక్రవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ అక్షర్ కు ఒక పీడకలలా మిగిలిపోయింది. ఈ సీజన్ లో అతను బ్యాట్ తో అస్సలు ప్రభావం చూపలేకపోతున్నాడు. తాజా మ్యాచ్ లో విఫలం అవ్వడం ద్వారా ఐపీఎల్ చరిత్రలోనే ఒక చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్ లో కనీసం 7 ఇన్నింగ్స్ లు ఆడిన కెప్టెన్లను పరిగణనలోకి తీసుకుంటే, అక్షర్ పటేల్ యావరేజ్ (6.28) రెండో స్థానంలో ఉంది. ఈ లిస్ట్ లో అగ్రస్థానంలో రాజస్థాన్ రాయల్స్ మాజీ కెప్టెన్ షేన్ వార్న్ (2.00 యావరేజ్, 2010 సీజన్) ఉన్నాడు. అక్షర్ తర్వాత ఇయాన్ మోర్గాన్ (11.08), హర్భజన్ సింగ్ (12.00), రవిచంద్రన్ అశ్విన్ (12.75) వంటి వారు ఉన్నారు. భారీ హిట్టింగ్ తో మ్యాచ్ లు గెలిపించాల్సిన కెప్టెన్ ఇలా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం అవ్వడం ఢిల్లీకి పెద్ద మైనస్ పాయింట్ అయింది. ప్రస్తుత ఐపీఎల్ లో బ్యాటర్లు 200 పైచిలుకు స్ట్రైక్ రేట్ తో విరుచుకుపడుతుంటే, అక్షర్ పటేల్ మాత్రం టెస్ట్ మ్యాచ్ ఇన్నింగ్స్ తరహాలో ఆడుతున్నాడు. ఈ సీజన్ లో కనీసం 50 బంతులు ఎదుర్కొన్న ఆటగాళ్లలో అక్షర్ స్ట్రైక్ రేట్ (74.57) అందరికంటే తక్కువ. టీ20 ఫార్మాట్ లో ఇలాంటి బ్యాటింగ్ టీమ్ విజయవకాశాలను దెబ్బతీస్తోంది. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో పరుగులు రాబట్టడంలో అతను పూర్తిగా తడబడుతున్నాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో కేకేఆర్ స్పిన్నర్లు సునీల్ నరైన్, అనుకుల్ రాయ్, వరుణ్ చక్రవర్తి ఆతిథ్య జట్టును ఊపిరి తీసుకోనివ్వలేదు. ఓపెనర్లు పాతుమ్ నిసాంక (50), కేఎల్ రాహుల్ (23) మంచి ఆరంభాన్ని ఇచ్చినా, ఆ తర్వాత వచ్చిన మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కేకేఆర్ స్పిన్ ఉచ్చులో చిక్కుకున్నారు. సునీల్ నరైన్ ప్రమాదకరమైన సమీర్ రిజ్వీని అవుట్ చేయగా, అనుకుల్ రాయ్ ఒకే ఓవర్లో నిశ్శంక, ట్రిస్టన్ స్టబ్స్ లను పెవిలియన్ పంపి ఢిల్లీ వెన్ను విరిచాడు.ఒకానొక దశలో ఢిల్లీ కనీసం 100 పరుగులు కూడా చేయలేని స్థితిలో ఉంది. ఆ సమయంలో యంగ్ ప్లేయర్ అశుతోష్ శర్మ 28 బంతుల్లో 39 పరుగులు చేసి స్కోరును 142కు చేర్చాడు. అతని పోరాటం లేకపోతే ఢిల్లీ పరువు దక్కేది కాదు. అక్షర్ పటేల్ ఫామ్ పై ఢిల్లీ కోచ్ హేమాంగ్ బదానీ స్పందిస్తూ.. ప్రదర్శన చేయాలి లేదా తప్పుకోవాలి' అనే స్థితిలో జట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ తన తర్వాతి మ్యాచ్ లలో పుంజుకోవాలంటే కెప్టెన్ అక్షర్ పటేల్ బ్యాట్ ఝుళిపించడం చాలా ముఖ్యం.

## వినేశ్ ఫొగాట్‌కు డబ్ల్యూఎఫ్ఐ షోకాజ్ నోటీసులు




స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్?ఐ) శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె క్రమశిక్షణా రాహిత్యానికి, డోపింగ్ నిరోధక నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడి నట్లు ఆరోపించింది. రిటైర్? అయిన అథ్లెట్లు, తిరిగి పోటీల్లో పాల్గొనాలంటే, యూడబ్ల్యూడబ్ల్యూ డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం, ముందస్తుగా 6 నెలల నోటీసును తప్పనిసరిగా ఇవ్వాలి. కానీ వినేశ్? దీనిని పాటించలేదని, అందుకే ఆమెను 2026 జూన్? 26 వరకు దేశీయ ఈవెంట్లలో పోటీ చేయడానికి అనర్హురాలిగా ప్రకటిస్తున్నట్లు సమాఖ్య పేర్కొంది. డబ్ల్యూఎఫ్?ఐ తన 15 పేజీల నోటీసులో, వినేశ్ ప్రవర్తన దేశానికి అవమానం కలిగించిదని, భారత రెజ్లింగ్ ప్రతిష్టను దెబ్బతీసిందని పేర్కొంది. డబ్ల్యూఎఫ్?ఐ రాజ్యాంగం, యూడబ్ల్యూడబ్ల్యూ అంతర్జాతీయ రెజ్లింగ్ నిబంధనలు, డోపింగ్ నిరోధక నిబంధనలను ఉల్లంఘించిందని ఆరోపించింది. వినేశ్?పై ప్రధానంగా 4 ఆరోపణలు చేసిన భారత రెజ్లింగ్ సమాఖ్య, వాటికి ఆమె వివరణ ఇవ్వాలని కోరింది. అవి ఏమిటంటే? 2024 పారిస్ ఒలింపిక్స్?లో బరువు పెరగడం వల్ల అనర్హ తకు గురవ్వడం, డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం, అథ్లెట్? ఎక్కడ ఉన్నారో తెలపాలి (వేర్ ఎబౌట్స్). కానీ ఆమె ఆ విషయాన్ని ఎందుకు చెప్పలేదు. 2024 మార్చిలో ఐఓఏ నియమించిన అడ్?-హాక్? ప్యానెల్? నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్?లో ఆమె రెండు వేర్వేరు బరువు విభాగాల్లో పోటీ చేయడం. ఇంకా క్రమశిక్షణ రాహిత్యానికి సంబంధించిన ఆరోపణలపై వినేశ్ వివరణ ఇవ్వాలని భారత రెజ్లింగ్ సమాఖ్య తేల్చిచెప్పింది. మరోవైపు మే 10 నుంచి మే 12 వరకు గోండాలో జరగనున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్?తో సహా ఏ దేశీయ ఈవెంట్?లోనూ వినేశ్ ఫొగాట్ పాల్గొనడానికి అర్హురాలు కాదని భారత రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసింది. ఈ ఏడాది జూన్ 26 వరకు ఇది వర్తిస్తుందని పేర్కొంది. వాస్తవానికి ఈ టోర్నమెంట్?ను తన పునరాగమనం (కమ్?-బ్యాక్) ఈవెంట్?గా వాడుకోవాలని వినేశ్ ఫొగాట్ భావించారు. కానీ తాజా నిషేధంతో ఆమె అందులో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయారు."ఇకపై ఏ రెజ్లింగ్? పోటీల్లోనైనా ఫెడరేషన్?కు ప్రాతినిధ్యం వహించాలంటే, వినేశ్ ఫొగాట్? ఎలాంటి డోపింగ్ నిరోధక నియమాలను ఉల్లంఘించలేదని ఫెడరేషన్ సంతృప్తి చెందాలి" అని డబ్ల్యూఎఫ్?ఐ తన నోటీసులో పేర్కొంది. అయితే ఈ నోటీసుపై స్పందించడానికి ఆమెకు 14 రోజుల సమయం ఇచ్చారు. పారిస్? ఒలింపిక్స్? రెజ్లింగ్ ఫైనల్ మ్యాచ్?లో అధిక బరువు కారణంగా వినేశ్ ఫొగాట్?పై అనర్హత వేటు పడింది. దీనితో ఆమె 2024లో రిటైర్?మెంట్ ప్రకటించారు.

# కొత్త అవతారంలోకి రోహిత్ శర్మ!



ఇండియన్ క్రికెట్ దిగ్గజం, సిక్సర్ల మెషిన్ రోహిత్ శర్మ ఇప్పుడు సరికొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నాడు. కేవలం క్రికెట్ పిచ్‌కే పరిమితం కాకుండా టెలివిజన్ ప్రపంచంలోకి తన అరంగేట్రం ఖరారు చేశాడు. దీనికి సంబంధించిన ఒక ఇంట్రెస్టింగ్ టీజర్‌ను సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్ రిలీజ్ చేసింది. ఈ టీజర్ చూస్తుంటే రోహిత్ ఒక స్పెషల్ షోతో రాబోతున్నట్లు అర్థమవుతోంది. త్వరలోనే ఈ షో టైటిల్, కాన్సెప్ట్ గురించి మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరపున రోహిత్ శర్మ తన క్లాస్ చూపిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనే 55.25 సగటుతో 221 పరుగులు చేశాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 174.01 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేస్తూ పాత రోహిత్ ను గుర్తు చేస్తున్నాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా 7,267 పరుగులతో రికార్డుల్లో ఉన్నాడు. కెప్టెన్‌గా ముంబైకి ఐదు టైటిల్స్ అందించిన ఘనత కూడా అతనికే సొంతం. 2007లో అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన రోహిత్, మూడు ఫార్మాట్లలో తిరుగులేని ప్లేయర్ గా ఎదిగాడు. ఓవరాల్ గా 508 మ్యాచ్‌ల్లో 20,109 పరుగులు సాధించాడు. ఇందులో 50 సెంచరీలు, 111 అర్థసెంచరీలు ఉన్నాయి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలను కెప్టెన్ గా, ప్లేయర్ గా గెలిచిన అరుదైన రికార్డు రోహిత్ ఖాతాలో ఉంది. టీ20 ఇంటర్నేషనల్స్ లో 4,231 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచిన రోహిత్, 2024 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం రోహిత్ ఫోకస్ అంతా 2027లో సౌత్ ఆఫ్రికా, జింబాబ్వే వేదికలుగా జరగబోయే వన్డే వరల్డ్ కప్ మీద ఉంది. ఇందుకోసం అతను తన ఫిట్‌నెస్ ను భారీగా మెరుగుపరుచుకున్నాడు. వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక ఆటగాడు రోహిత్. 264 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. టెస్టుల్లో కూడా 40కి పైగా సగటుతో 4,301 పరుగులు చేసి తన సత్తా చాటుకున్నాడు. రోహిత్ కేవలం బ్యాటింగ్ తోనే కాదు, మైదానంలో తన హావభావాలు, స్టంప్ మైక్ లో రికార్డ్ అయ్యే సరదా మాటలతో ఎప్పుడూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ ఉంటాడు. అతని కామెడీ టైమింగ్, సెటైర్లు నెటిజన్లకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తాయి. బహుశా ఇదే క్వాలిటీ అతన్ని ఇప్పుడు టీవీ షో వైపు నడిపించి ఉండొచ్చు. క్రికెట్ పిచ్ పై ప్రత్యర్థులను వణికించే హిట్‌మ్యాన్, ఇప్పుడు బుల్లితెరపై ప్రేక్షకులను ఎలా మెప్పిస్తాడో చూడాలని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ......

# జీటీ జిగేల్.. గుజరాత్‌కు వరుసగా నాలుగో విజయం

### దంచికొట్టిన గిల్.. రషీద్ మ్యాజిక్

### 77 పరుగుల తేడాతో ఓడిన రాజస్థాన్

జైపూర్: ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారిన దశలో గుజరాత్ టైటాన్స్(జీటీ) టాప్ గేరులో దూసుకెళ్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 84) మెరు పు బ్యాటింగ్‌కు తోడు రషీద్ ఖాన్ (4/33) స్పిన్ మ్యాజిక్ చేయడంతో వరుసగా నాలుగో మ్యాచ్‌లో గెలిచి రెండో ప్లేస్‌కు దూసుకొచ్చింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 77 రన్స్ తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించింది. గిల్, సాయి సుదర్శన్ (36 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో55) ఫిఫ్టీలతో రాణించడంతో తొలుత జీటీ 20 ఓవర్లలో 229/4 స్కోరు చేసింది. ఛేజింగ్‌లో రాయల్స్ 16.3 ఓవర్లలో152కే ఆలౌటై ఐదో ఓటమి మూటగట్టుకుంది. జడేజా (25 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38), వైభవ్ సూర్యవంశీ (16 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 36) పోరాడారు. హోల్డర్ (3/12) మూడు వికెట్లు తీశాడు. రషీద్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

### గిల్-సుదర్శన్ షో

ఓపెనర్లు సుదర్శన్- గిల్ పవర్ ప్లేలో దంచికొట్టడంతో టైటాన్స్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఆర్చర్ వేసిన తొలి ఓవర్లోనే నాలుగు వైడ్స్, నోబాల్‌తో కలుపుకుని 18 రన్స్ టైటాన్స్ ఖాతాలో చేరాయి. బ్రిజేష్ రెండో ఓవర్లో ఫోర్, సిక్స్‌తో బాదుడుకు శ్రీకారం చుట్టిన సాయి.. ఆ వెంటనే దేశ్‌పాండేనూ అలాగే శిక్షించాడు. ఆర్చర్ ఐదో ఓవర్లో 4, 6, 4తో గిల్ సైతం జోరందుకోవడంతో పవర్ ప్లేలో జీటీ



82/0తో పటిష్ట స్థితిలో నిలిచింది. 30 బంతుల్లో సాయి అర్ధ శతకం పూర్తవగా.. పదోఓవర్లో సింగిల్‌తో గిల్ కూడా ఈ సీజన్‌లో నాలుగో హాఫ్ సెంచరీ సాధించాడు.

అయితే ఇదే ఓవర్లో సాయి.. లాంగాన్‌లో ఆర్చర్‌కు క్యాచ్ ఇవ్వడంతో 118 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. వన్‌డౌన్‌లో వచ్చి సిక్స్, ఫోర్‌తో టచ్‌లో కనిపించిన బట్లర్ (13)ను జడేజా వెనక్కి పంపాడు. అయినా సుందర్ (37 నాటౌట్)తో కలిసి మరింత ధాటిగా ఆడేందుకు యత్నించిన గిల్.. చూడచక్కని షాట్లతో అలరించినా బ్రిజేష్ 17వ ఓవర్లో తుషార్‌కు క్యాచ్ ఇవ్వడంతో టైటాన్స్ స్పీడు తగ్గింది. ఒకదశలో 250 ప్లస్ స్కోరు చేస్తుందనుకున్న ఆ జట్టు.. ఆఖర్లో తడబడ్డా సుందర్, తెవాటియా (14 నాటౌట్) మెరుపులతో భారీ లక్ష్యాన్ని ఉంచింది.

### తిప్పేసిన రషీద్

ఛేదనలో ఎప్పట్లాగే సూర్యవంశీ బ్యాట్‌కు పనిచెప్పడటంతో రాయల్స్ ఇన్నింగ్స్ ధాటిగానే మొదలైంది. ఆ సీజన్‌లో నాలుగోసారి సిక్స్‌తో ఖాతా తెరిచిన ఈ వండర్ కిడ్.. సిరాజ్, రబాడ బౌలింగ్‌లో భారీ షాట్లతో అలరించాడు. కానీ, మూడో ఓవర్లో సిరాజ్ వేసిన బౌన్సర్‌ను ఆడబోయి ఫైన్ లెగ్ వద్ద అర్షద్ చేతికి చిక్కాడు. ఆ వెంటనే రబాడ.. స్టాండిన్ కెప్టెన్ జైస్వాల్ (3)ను ఔట్ చేయగా హెట్‌మయర్ (6) సైతం నిరాశపరిచాడు. జురెల్ (24).. సిరాజ్ ఐదో ఓవర్లో 6, 4, 6, 6తో 22 రన్స్ రాబట్టడంతో ఆ జట్టు ఛేదన దిశగా సాగుతున్నట్టే కనిపించింది.

కానీ 8వ ఓవర్లో బౌలింగ్‌కు దిగిన రషీద్ మ్యాచ్‌ను వన్‌సైడ్ చేసేశాడు. జురెల్‌తో పాటు హార్డ్ హిట్టర్ ఫెరీరా (4)నూ క్లీన్‌బౌల్డ్ చేసి రాయల్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. తన తర్వాతి ఓవర్లో శుభం దూబే (15)ను కూడా బౌల్డ్ చేసిన రషీద్.. ఒంటరిపోరాటం చేస్తున్న జడేజాను ఏడో వికెట్‌గా ఎల్బీ చేయడంతో రాయల్స్ ఓటమి ఖాయమైంది. హోల్డర్ మిగిలిన ముగ్గురి పని పట్టాడు.

### వండర్ కిడ్ ఏ 100 సిక్సర్లు

టీ20 క్రికెట్‌లో వేగంగా 100 సిక్సర్లు కొట్టిన ప్లేయర్‌గా, ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా 15 ఏళ్ల సూర్యవంశీ రికార్డుకెక్కాడు. 515 బంతుల్లో అతను ఈ మార్కు అందుకొని కరణ్‌బీర్ సింగ్ (813 బంతులు) రికార్డు బ్రేక్ చేశాడు.

# ఐర్లాండ్ పర్యటనకు టీమిండియా..

### 15 మంది సభ్యులతో కూడిన జట్టు సిద్ధం

భారత్ వర్సెస్ ఐర్లాండ్ మధ్య రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జూన్ చివరలో ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ జూన్ 26న, రెండో మ్యాచ్ జూన్ 28న జరగనున్నాయి. సమయాభావం కారణంగా కేవలం రెండు మ్యాచ్‌లకే ఈ సిరీస్‌ను పరిమితం చేశారు. ఐపీఎల్ ముగిసిన వెంటనే ఆటగాళ్ల పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో అందరినీ ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే, టీ20 స్పెషలిస్ట్ సూర్యకుమార్ యాదవ్ జట్టులో లేకపోవడం. ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో సూర్య 10 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 195 పరుగులు మాత్రమే చేసి ఫామ్ కోల్పోయాడు. దీంతో అతడిని జట్టు నుంచి తప్పించాలని సెలక్టర్లు భావిస్తున్నారు. మరోవైపు, మొహమ్మద్ సిరాజ్, రింకూ సింగ్‌లకు రాబోయే ఇంగ్లాండ్ పర్యటన దృష్ట్యా విశ్రాంతి కల్పించారు. వీరు ప్రస్తుతం ఐపీఎల్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తుండటంతో, వారిని తదుపరి పెద్ద సిరీస్‌ల కోసం తాజాగా ఉంచాలని బోర్డు యోచిస్తోంది. ఈ సిరీస్‌లో టీమ్ ఇండియాకు సంజూ శామ్సన్ నాయకత్వం వహించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా ఐపీఎల్‌లో తన మార్క్ చూపించిన సంజూపై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. ముఖ్యంగా ఈ ఏడాది ఐపీఎల్‌లో రెండు సెంచరీలతో భీకర ఫామ్‌లో ఉండటం అతడికి కలిసొచ్చింది. భవిష్యత్తు టీ20 కెప్టెన్‌గా సంజూను తీర్చిదిద్దాలనే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు కనిపిస్తోంది. శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సిరీస్‌లో యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కడం విశేషం. ఐపీఎల్‌లో మెరుపు సెంచరీతో ఆకట్టుకున్న అతడు జాతీయ జట్టులోకి రావడం హాట్ టాపిక్ అయింది. వీరితో పాటు లక్నో సూపర్ జెయింట్స్ వేగవత్తమైన బౌలర్లు ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్ కూడా మొదటిసారి నీలి రంగు జెర్సీని ధరించబోతున్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 10 మే, 2026


# రౌడీ జనార్ధన్ నుంచి ప్రత్యేక పోస్టర్ విడుదల

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర యూనిట్ అదిరిపోయే కానుక అందించింది. యువ దర్శకుడు రవికిరణ్ కోల దర్శకత్వంలో విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'రౌడీ జనార్ధన్. వరుస సినిమాలతో, విభిన్నమైన కథలతో ప్రేక్షకుల ముందుకువస్తున్నారు నటుడు విజయ్ దేవరకొండ. ప్రస్తుతం రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఆయన నటిస్తోన్న చిత్రం 'రౌడీ జనార్ధన్'. విజయ్ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ప్రత్యేక పోస్టర్ పంచుకుంది. ఇప్పటివరకూ విజయ్ సీరియస్ లుక్‌లో ఉన్న ఫొటోలు పంచుకున్న చిత్రబృందం తాజాగా ఓ లవ్లీ పోస్టర్‌ను షేర్ చేసింది. 'ప్రపంచంతో పోరాడతాడు.. ప్రేమకు లొంగిపోతాడు' అంటూ విజయ్‌కు విషెస్ తెలిపింది. ఇందులో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ కనిపించనున్నారు. దిల్‌రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఆయన ఇందులో విజయ్ పాత్ర గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. 'విజయ్ దేవరకొండ ఇప్పటివరకు విభిన్నమైన సినిమాలు చేస్తూ వచ్చాడు. కానీ, ఇలాంటి పూర్తిస్థాయి మాస్ పాత్ర ఇంతవరకు చేయలేదు. తొలిసారి ఈ సినిమాలో తనతో తూర్పుగోదావరి యాసలో మాట్లాడిస్తున్నాం. ఈ కథ విన్నప్పుడే నాకు చాలా వినూత్నంగా అనిపించింది. 80వ దశకం నేపథ్యంలోని ప్రపంచాన్ని మా సాంకేతిక నిపుణులంతా అద్భుతంగా పునఃసృష్టించారు' అని తెలిపారు. ఈ సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ ఇంటెన్స్ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. అతడి గుండెపై హీరోయిన్ కాలు పెట్టగా.. ప్రపంచంతో పోరాడే మొండివాడు.. కానీ ప్రేమకు మాత్రమే తలవంచుతాడు అంటూ ఈ పోస్టర్‌కి క్యాప్షన్ ఇచ్చారు. కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు.




# విజయ్ బర్త్‌డే..రణబాలి నుంచి గ్లింప్స్ విడుదల




టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు 'రణబాలి' చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. విజయ్‌కి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. తాజాగా ఈ సినిమా నుంచి కొత్త గ్లింప్స్‌ను పంచుకుంది చిత్రయూనిట్. టాక్సీవాలా వంటి ఘనవిజయం తర్వాత విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ భారీ చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 19వ శతాబ్దపు రాయలసీమ నేపథ్యంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మందన్న 'జయమ్మ' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తుండగా, వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న హ్యాట్రిక్ చిత్రం కావడంతో ఫ్యాన్స్‌లో క్రేజ్ రెట్టింపు అయింది. ఈ చిత్రంలో మరో ప్రధాన ఆకర్షణ ఏమిటంటే, 'ది మమ్మీ' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ, సర్ థియోడర్ హెక్టర్ అనే బ్రిటిష్ అధికారిగా విలన్ పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ మరియు టి-సిరీస్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అజయ్-అతుల్ సంగీతాన్ని అందిస్తుండగా, నీరవ్ షా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

# శరవేగంగా ఇరుముడి చిత్ర నిర్మాణం




మాస్ మహారాజ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఇరుముడి ప్రస్తుతం టాలీవుడ్‌లో మంచి హైప్‌ను క్రియేట్ చేస్తోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా మొదటి అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా డివోషనల్ టచ్‌తో పాటు ఎమోషనల్ డ్రామాను కలగలిపిన కథాంశంతో ఈ సినిమా రాబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ గత చిత్రాలకు భిన్నంగా ఓ పవర్‌ఫుల్ మరియు భావోద్వేగభరిత పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు బలమైన భావోద్వేగాలు కూడా సినిమాలో ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, తాజాగా లభించిన సమాచారం ప్రకారం చిత్రీకరణ దాదాపు చివరి దశకు చేరుకుందని తెలుస్తోంది. ఇంకా సుమారు నెల రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో మేకర్స్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో పనులు పూర్తి చేసే దిశగా ముందుకెళు న్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని జీవి ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు. ఇప్పటికే పలువురు భిన్నమైన ప్రాజెక్టులతో తన మార్క్ చూపించిన జీవి ప్రకాష్.. 'ఇరుముడి' కోసం కూడా ప్రత్యేకమైన మ్యూజిక్ వర్క్ చేస్తున్నారని సమాచారం. ముఖ్యంగా ఈ సినిమా కాన్సెప్ట్ పట్ల ఆయనే ఎంతో ఎ÷-జగ్రైటెడ్‌గా ఉన్నారని టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది.




ఇటీవల వరుస విజయాలతో టాప్ ప్రొడక్షన్ హౌస్‌గా నిలిచిన మైత్రి సంస్థ.. 'ఇరుముడి'ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. యాక్షన్, భక్తి, ఎమోషన్‌ల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సంపాదించుకోవడం విశేషం. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాత ఈ సినిమాను అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# రావు బహద్దూర్ మూవీ విడుదల వాయిదా



వెర్సటైల్ నటుడు సత్యదేవ్, విలక్షణ దర్శకుడు వెంకటేష్ మహా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్' విడుదల తేదీ మరోసారి మారింది. ఈ చిత్రాన్ని తొలుత జూన్ 5న విడుదల చేయాలని చిత్ర బృందం భావించినప్పటికీ, జూన్ 4న రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల కానున్న నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద క్లాష్‌ను తప్పించడానికి మేకర్స్ వెనక్కి తగ్గారు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు తన సొంత బ్యానర్ 'జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్' ద్వారా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే మరియు ఎడిటింగ్ బాధ్యతలను కూడా స్వయంగా నిర్వహిస్తున్నారు. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాల పరాశర్, ఆనంద్ భారతి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఒక పురాతన రాజవంశం, వారసత్వం మరియు రహస్యాల చుట్టూ తిరిగే గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సత్యదేవ్ పవర్ ఫుల్ ఎల్డర్లీ లుక్‌లో కనిపించబోతున్నారు. 'అనుమానం పెనుభూతం' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే విడుదలైన పోస్టర్లు మరియు 'ఓ సుందరి' సాంగ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచాయి.

# క్రీడా మంత్రిగా మాజీ క్రికెటర్!




పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మాజీ టీమిండియా పేసర్ అశోక్ దిండా నూతన క్రీడా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో, క్రీడా రంగంలో విశేష అనుభవమున్న దిండాకు ఈ పదవి దక్కింది. బీజేపీ మొత్తం 294 స్థానాలకు గాను 206 సీట్లను గెలుచుకుని అధికారాన్ని చేజిక్కించుకుంది. ఈ విజయ పరంపరలో దిండా మొయినా నియోజకవర్గం నుంచి వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2021లో తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆయన, ప్రతిపక్ష హోదా నుంచి ఇప్పుడు నేరుగా కేబినెట్ మంత్రిగా పదోన్నతి పొందారు. మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే సౌరవ్ సిక్దర్, మాజీ హాకీ స్టార్ భరత్ ఛెత్రి వంటి వారి నుంచి అశోక్ దిండాకు తీవ్ర పోటీ ఎదురైంది. క్రీడా రంగంలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవం, క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన బెంగాల్ క్రీడలకు మేలు చేస్తాయని భావించిన అధిష్టానం, దిండా వైపే మొగ్గు చూపింది. బెంగాల్ క్రీడా శాఖ బాధ్యతలు వరుసగా ఇద్దరు క్రికెటర్లకే దక్కడం విశేషం. గత తృణమూల్ ప్రభుత్వంలో మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ క్రీడా మంత్రిగా ఉండగా, ఇప్పుడు అశోక్ దిండా ఆ బాధ్యతలను స్వీకరించారు. అశోక్ దిండా క్రికెట్ కెరీర్‌కు క్రీడాభిమానుల్లో గొప్ప గౌరవం ఉంది. 2008లో ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చి, తనదైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. భారత్ తరపున 13 వన్డేలు, 9 టీ20లు ఆడిన ఆయన, డొమెస్టిక్ క్రికెట్‌లో బెంగాల్ జట్టుకు వెన్నెముకగా నిలిచారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఏకంగా 420 వికెట్లు పడగొట్టి తన సత్తా చాటారు. 2021లో క్రికెట్‌కు స్వస్తి చెప్పిన దిండా, ఇప్పుడు రాజకీయ మైదానంలో క్రీడా మంత్రిగా తన రెండో ఇన్నింగ్స్‌ను ఘనంగా ప్రారంభించారు...

జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 10 మే , 2026


## ఊపిరితిత్తుల్లో అధికంగా చేరే మ్యూకస్‌ను ఇలా తొలగించుకోవచ్చు వెల్లడిస్తున్న నిపుణులు



ఛాతీలో బరువుగా అనిపించడం, పదే పదే దగ్గు రావడం, సరిగా శ్వాస తీసుకోలేకపోవడం వంటి సమస్యలు ఊపిరితిత్తుల్లో అధిక మ్యూకస్ పేరుకుపోవడం వల్ల కలుగుతాయి. జలుబు, అలర్జీలు, కాలుష్యం లేదా శ్వాసకోశ సమస్యల కారణంగా ఈ ఇబ్బంది మరింత పెరుగుతుంది. అయితే శరీరానికి సహజంగానే మ్యూకస్‌ను బయటకు పంపించే వ్యవస్థ ఉందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సులభమైన అలవాట్లు పాటించడం ద్వారా ఊపిరితిత్తుల్లోని మ్యూకస్‌ను సహజంగా తగ్గించుకుని సులభంగా శ్వాస తీసుకోవచ్చని సూచిస్తున్నారు. సాధారణంగా మ్యూకస్ శరీరానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఇది దుమ్ము, బ్యాక్టీరియా, కాలుష్య కణాలు వంటి హానికర పదార్థాలను ఊపిరితిత్తుల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటుంది.

### వేడి సూప్‌లు, హెర్బల్ టీలు..

అయితే శరీరం అధికంగా మ్యూకస్ ఉత్పత్తి చేసినప్పుడు లేదా అది సరిగా బయటకు రాకపోతే సమస్యలు ప్రారంభమవుతాయి. జలుబు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, ధూమపానం, అధిక కాలుష్యం, ఆస్తమా లేదా బ్రాంకైటిస్ వంటి సమస్యల కారణంగా మ్యూకస్ ఎక్కువగా పేరుకుపోతుంది. ఊపిరితిత్తుల్లో మ్యూకస్ ఎక్కువగా పేరుకుపోయినప్పుడు నీటిని ఎక్కువగా తాగాలి. శరీరంలో తగినంత నీరు ఉండటం వల్ల మ్యూకస్ పలుచబడుతుంది. దీంతో అది సులభంగా బయటకు వస్తుంది. ముఖ్యంగా వేడి పానీయాలు తీసుకోవడం మంచిది. హెర్బల్ టీ, తేనె కలిపిన గోరువెచ్చని నీరు, సూప్‌లు వంటివి తాగాలి. ఇవి గొంతుకు ఉపశమనం ఇవ్వడంతోపాటు ఛాతీలోని బిగుతును తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే మ్యూకస్ ఎక్కువగా ఉన్నప్పుడు ఆవిరి పీల్చడం మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. పాతకాలం నుంచి ఉపయోగిస్తున్న ఆవిరి పద్ధతి ఇప్పటికీ ప్రయోజనకరంగానే ఉంటుంది. వేడి ఆవిరి శ్వాసనాళాల్లోని మ్యూకస్‌ను సడలించి బయటకు రావడానికి సహాయపడుతుంది. వేడి నీటితో ఆవిరి పీల్చడం, వేడి నీటితో స్నానం చేసే సమయంలో యూకలిప్టస్ ఆయిల్ కొన్ని చుక్కలు వేస్తే మరింత ఉపశమనం లభిస్తుంది.

### శ్వాస వ్యాయామాలు..

శ్వాస వ్యాయామాలు కూడా ఉపయోగకరంగా ఉంటాయి. శ్వాసకోశ ఆరోగ్యానికి కొన్ని సులభమైన శ్వాస వ్యాయామాలు సహాయపడతాయి. ముక్కు ద్వారా నెమ్మదిగా గాలిని పీల్చి కొన్ని సెకన్లు ఆపి మళ్లీ నెమ్మదిగా వదలాలి. అలాగే గొంతుపై ఒత్తిడి లేకుండా నెమ్మదిగా దగ్గడం ద్వారా మ్యూకస్ బయటకు వస్తుంది. ఛాతీ కంటే పొట్ట విస్తరించేలా శ్వాస తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులకు ఎక్కువ గాలి చేరుతుంది. దీని వల్ల కూడా మ్యూకస్ బయటకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంట్లో లభించే కొన్ని సాధారణ వంటింటి పదార్థాలు శ్వాసకోశ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అల్లం, పసుపు, తేనె వంటి వాటిని వాడడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

### గాలి నాణ్యత..

ఇండోర్ ఎయిర్ క్వాలిటీ కూడా ఊపిరితిత్తుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇంట్లో గాలి సరిగా ఆడేలా చూడాలి. దుమ్ము, పొగ, కెమికల్ వాసనల నుంచి దూరంగా ఉండాలి. అవసరమైతే ఎయిర్ ప్యూరిఫైయర్ ఉపయోగించాలి. వీటితో పాటు శారీరక కదలికలు ఉండడం కూడా చాలా ముఖ్యం. చిన్నపాటి వ్యాయామం కూడా మ్యూకస్‌ను సడలించడంలో సహాయపడుతుంది. నడక, యోగా, స్ట్రెచింగ్ వ్యాయామాలు వంటి చేయడం మంచిది. ఎక్కువసేపు పడుకుని ఉండటం వల్ల మ్యూకస్ ఛాతీలోనే పేరుకుపోయే అవకాశం ఉంటుంది. కనుక ఎక్కువ సమయం పడుకోవడాన్ని నివారించడం మంచిది.

### ఎక్కువ వారాలపాటు ఉంటే..

సహజ పద్ధతులు కొంతవరకు ఉపశమనాన్ని ఇచ్చినప్పటికీ సమస్య కొన్ని వారాలకంటే ఎక్కువ కొనసాగినా, జ్వరం వచ్చినా, ఛాతీలో నొప్పి, మ్యూకస్‌లో రక్తం కనిపించడం వంటి సమస్యలు కనిపించినా వెంటనే వైద్యున్ని సంప్రదించడం మంచిది. ఇవి బ్రాంకైటిస్, ఆస్తమా లేదా ఇతర ఇన్ఫెక్షన్ల లక్షణాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఊపిరితిత్తుల్లో మ్యూకస్ పేరుకుపోవడం అసౌకర్యంగా ఉన్నప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకుంటే సహజంగానే ఉపశమనం పొందవచ్చు. తగినంత నీరు తాగడం, ఆవిరి పీల్చడం, వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం ద్వారా శ్వాసను సులభతరం చేసుకోవచ్చు. సమస్య తీవ్రమైతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# తల్లి ప్రేమకు ప్రతీకగా మదర్స్ డే

- అమ్మ త్యాగాలను గుర్తు చేసుకునే ప్రత్యేక రోజు
- కుటుంబ బంధాలను మరింత బలపరిచే వేడుక
- ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహణ



డెస్క్, మే 09 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): మనిషి జీవితంలో ఎప్పటికీ మారని బంధం తల్లి బంధం. ఒక బిడ్డ ఈ ప్రపంచంలోకి రాకముందే తన ప్రేమను పంచడం ప్రారంభించే వ్యక్తి తల్లే. పిల్లల కోసం తన జీవితాన్ని అంకితం చేస్తూ, వారి ఆనందాన్ని తన ఆనందంగా భావించే అమ్మ గొప్పతనాన్ని గుర్తు చేసుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే నెల రెండో ఆదివారం "మదర్స్ డే"గా జరుపుకుంటారు. ఈసారి మే 10న ఈ ప్రత్యేక రోజు వచ్చింది. తల్లి ప్రేమ, ఆమె త్యాగాలు, కుటుంబం కోసం చేసిన సేవలను స్మరించుకునే సందర్భంగా ఈ రోజును ఎంతో భావోద్వేగంగా నిర్వహిస్తున్నారు. తల్లి అనేది కేవలం ఒక సంబంధం మాత్రమే కాదు, అది ఒక అపారమైన భావోద్వేగం. బిడ్డ చిన్ననాటి నుంచి పెద్దవాడయ్యే వరకు ప్రతి అడుగులోనూ తల్లి పాత్ర కీలకంగా ఉంటుంది. పిల్లల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తు కోసం ఎన్నో కష్టాలను భరిస్తూ కుటుంబానికి అండగా నిలుస్తుంది. రాత్రింబవళ్లు కష్టపడుతూ పిల్లల ముఖంలో చిరునవ్వు చూడటమే తన లక్ష్యంగా భావించే అమ్మ ప్రేమకు ఎలాంటి ప్రతిఫలం ఉండదని పెద్దలు చెబుతుంటారు.

మదర్స్ డే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ తల్లులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ బహుమతులు అందిస్తున్నారు. కొందరు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటే, మరికొందరు అమ్మతో కలిసి సమయం గడుపుతూ ఆమెను ఆనందింపజేస్తున్నారు. సోషల్ మీడియా వేదికల్లో కూడా తల్లులతో ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగ సందేశాలు పోస్టు చేస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలలు కూడా మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులతో పాటలు, నృత్యాలు, ప్రసంగాలు చేయిస్తూ తల్లి గొప్పతనాన్ని తెలియజేస్తున్నారు. కొన్నిచోట్ల తల్లులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి సేవలను గుర్తిస్తున్నారు. చిన్నారులు తమ చేతులతో తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు ఇచ్చి తల్లుల పట్ల ప్రేమను వ్యక్తం చేస్తున్నారు.

నేటి కాలంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, సాంకేతిక జీవనశైలి కారణంగా కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదర్స్ డే కుటుంబ బంధాలను మరింత దగ్గర చేసే సందర్భంగా మారుతోంది. పిల్లలు తమ తల్లులతో గడిపే ప్రతి క్షణాన్ని గుర్తు చేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ రోజు కుటుంబాల్లో ఆనందాన్ని తీసుకువస్తోంది. తల్లి చేసే త్యాగాలకు కొలమానం ఉండదు. పిల్లలు అనారోగ్యానికి గురైతే తల్లి పడే ఆందోళన, వారి విజయాల్లో ఆమె పొందే ఆనందం, వారి బాధల్లో తాను కూడా కుంగిపోవడం వంటి భావాలు తల్లి ప్రేమను మరింత గొప్పగా నిలబెడతాయి. తన పిల్లల కోసం ఎన్నో కలలను త్యాగం చేస్తూ వారికి మంచి భవిష్యత్తు ఇవ్వడమే అమ్మ లక్ష్యంగా ఉంటుంది.

ప్రస్తుతం సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. తమను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను కొందరు నిర్లక్ష్యం చేస్తున్న ఘటనలు కూడా కనిపిస్తున్నాయి. మదర్స్ డే సందర్భంగా తల్లిదండ్రుల పట్ల గౌరవం చూపించాలని, వారిని ప్రేమగా చూసుకోవాలని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లులకు పిల్లల ఆదరణ ఎంతో అవసరమని చెబుతున్నారు. మదర్స్ డే చరిత్రను పరిశీలిస్తే అమెరికాలోనే ఈ సంప్రదాయం ప్రారంభమైంది. తల్లుల సేవలను గౌరవించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ ప్రత్యేక రోజు తర్వాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం అనేక దేశాలు ఈ రోజును ఎంతో ఘనంగా జరుపుకుంటున్నాయి. భారతదేశంలో కూడా గత కొన్నేళ్లుగా మదర్స్ డే వేడుకలు విస్తృతంగా జరుగుతున్నాయి.

వైద్యులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు ఇలా ప్రతి రంగంలోనూ ఉన్న మహిళలు తల్లులుగా కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఉద్యోగ జీవితంతో పాటు కుటుంబాన్ని చూసుకోవడం అనేది ఎంతో కష్టమైన పని అయినప్పటికీ తల్లులు దాన్ని చిరునవ్వుతో నిర్వహిస్తున్నారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండటంలో తల్లి పాత్ర ఎంతో ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. మదర్స్ డే అనేది కేవలం ఒక రోజు మాత్రమే కాదు. ప్రతి రోజూ తల్లిని గౌరవించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని గుర్తు చేసే సందర్భం. అమ్మ ప్రేమకు విలువ కట్టలేమని, ఆమె చేసిన సేవలకు జీవితాంతం రుణపడి ఉంటామని చాలా మంది భావోద్వేగంగా చెబుతున్నారు. తల్లి ఉన్న ఇల్లు స్వర్గంతో సమానమని పెద్దలు చెప్పిన మాటలను మరోసారి గుర్తు చేస్తూ మదర్స్ డే ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆనందం, అనుబంధాలను మరింత పెంచుతోంది.

# అశోక్ నగర్‌లో కనువిందుగా హనుమాన్ నగర సంకీర్తన



హనుమాన్ పరపతి సంఘం ఆధ్వర్యంలో
అధిక సంఖ్యలో పాల్గొన్న హనుమాన్ స్వాములు భక్తులు

ఖానాపురం, మే 09,తరంగాలు : ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామం లో హనుమాన్ పరపతి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ స్వాములు హనుమాన్ నగర సంకీర్తనను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ స్వాములు హనుమాన్ నగర సంకీర్తనను శ్రీ కోదండ రామాలయం దేవస్థానం నుండి అశోక్ నగర్ గ్రామం వీధుల లో హనుమాన్ స్వామిని పల్లకిలో ఆటపాటలతో డిజె హనుమాన్ పాటలతో గ్రామం నాలుగు వీధుల నుండి ఘనంగా మహిళ భక్తులు గ్రామస్తులు హనుమాన్ మాలధార స్వాములతో అంగరంగ వైభవంగా నగర సంకీర్తన కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం శ్రీ కోదండ రామాలయం దేవస్థానంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన దాత సట్ల నరేష్ దంపతుల ఆధ్వర్యంలో హనుమాన్ మాలాధార స్వాముల కు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి స్వాముల ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, గ్రామస్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు.

## చర్మం ఆరోగ్యంగా, అందంగా కనిపించాలంటే ఖరీదైన క్రీములు అవసరం లేదు.. వీటిని తీసుకోండి చాలు

చర్మం అందంగా, కాంతివంతంగా ఉండాలంటే ఖరీదైన క్రీములు లేదా సుదీర్ఘమైన స్కిన్‌కేర్ రొటీన్లు అవసరమని చాలా మంది భావిస్తారు. అయితే నిపుణులు చెబుతున్నది మాత్రం వేరే విషయం. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారమే చర్మ ఆరోగ్యంపై అధిక ప్రభావం చూపుతుందని వారు తెలియజేస్తున్నారు. మొటిమలు, మసకబారిన చర్మం, డార్క్ సర్కిల్స్, పొడిబారిన చర్మం వంటి సమస్యలు చాలా సందర్భాల్లో శరీరంలో పోషక లోపాలను సూచిస్తాయని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో కొన్ని సాధారణ పదార్థాలను చేర్చడం ద్వారా సహజంగా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వారు వివరిస్తున్నారు. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఎలాంటి ఆహారాలను తీసుకోవాలో వారు తెలియజేస్తున్నారు.

### పచ్చి ఉసిరికాయ, స్పియర్‌మింట్ టీ..

మసకబారిన చర్మానికి పచ్చి ఉసిరికాయ మంచి ఔషధంగా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉదయం ఒక పచ్చి ఉసిరికాయ తినడం వల్ల శరీరానికి విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. ఇది చర్మానికి సహజ కాంతిని తీసుకురావడంలో సహాయపడుతుంది. అలసటగా, నిస్సత్తువగా కనిపించే చర్మానికి ఇది మంచి ఎంపిక అని చెప్పవచ్చు.

## ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా దీన్ని చేసి తినండి నిమిషాల్లో అవుతుంది, ఎంతో పోషకవంతం

ఉదయం అల్పాహారం రోజంతా శక్తివంతంగా ఉండేందుకు ఎంతో ముఖ్యమైనది. అయితే బిజీ జీవితంలో చాలా మంది త్వరగా తయారయ్యే, పోషకాలు తక్కువగా ఉన్న ఆహారాన్ని ఎంచుకుంటున్నారు. అలాంటి సమయంలో తక్కువ సమయంలో తయారయ్యే, రుచికరమైన, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే ఎగ్ పోహా మంచి ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. సాధారణ పోహాలో గుడ్లు కలపడం వల్ల ఇది మరింత పోషకవంతమైన బ్రేక్‌ఫాస్ట్‌గా మారుతుంది. సాధారణంగా పోహా దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన అల్పాహారం. ముఖ్యంగా మహారాష్ట్రలో ఇది సంప్రదాయ వంటకం. తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది అనుకూలంగా ఉంటుంది. జీర్ణక్రియకు సులభంగా ఉండటంతో పాటు ఎక్కువసేపు ఆకలి వేయకుండా సహాయపడుతుంది.

### గుడ్లు కలిపితే బ్యాలెన్స్‌డ్ మీల్..

ఇక గుడ్లు ప్రోటీన్‌కు మంచి వనరు. పోహాలో గుడ్లు కలపడం ద్వారా ఈ అల్పాహారం మరింత బ్యాలెన్స్‌డ్ మీల్‌గా మారుతుంది. అధిక ప్రోటీన్ కారణంగా ఎక్కువసేపు పొట్ట నిండిన భావన కలిగి, మధ్యలో జంక్ ఫుడ్ తినాలనే కోరిక తగ్గుతుంది. ఇది బరువు నియంత్రణకు కూడా ఉపయోగపడుతుంది. ఈ వంటకం తయారీ చాలా సులభం. ఆవాలు, కరివేపాకు, ఉల్లిపాయ, టమాటాతో తాలింపు తయారు చేసి, అందులో గుడ్లు వేసి బాగా కలపాలి. తర్వాత నానబెట్టిన పోహా కలిపి కొన్ని నిమిషాలు వండితే సరిపోతుంది. చివరగా కొత్తిమీర, నిమ్మరసం కలిపితే రుచికరమైన ఎగ్ పోహా సిద్ధమవుతుంది.

### పదార్థాలు, తయారీ..

గుడ్లు -- 2, పోహా -- 1 కప్పు, ఉల్లిపాయ -- 1 (సన్నగా తరిగినది), టమాటా -- 1 (సన్నగా తరిగినది), పచ్చిమిర్చి -- 2, నూనె లేదా నెయ్యి -- 1 టేబుల్ స్పూన్, కరివేపాకు -- 7 నుంచి 8, ఆవాలు -- అర టీస్పూన్, పసుపు -- అర టీస్పూన్, కారం -- అర టీస్పూన్, ఉప్పు -- తగినంత, కొత్తిమీర -- 2 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం -- 2 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి. ముందుగా పోహాని నానబెట్టాలి. పోహాను నీటిలో కడిగి 5 నిమిషాలు పక్కన పెట్టాలి. తరువాత తాలింపు తయారు చేసుకోవాలి. దీని కోసం పాన్‌లో నూనె లేదా నెయ్యి వేడి చేసి ఆవాలు, కరివేపాకు వేయాలి. తర్వాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి వేసి 2 నిమిషాలు వేయించాలి. తాలింపు వేగిన తరువాత టమాటా వేసి మెత్తబడే వరకు వండాలి. తర్వాత పసుపు, కారం, ఉప్పు కలపాలి. తరువాత గుడ్లను నేరుగా పాన్‌లో పగలగొట్టి బాగా స్క్రాంబుల్ చేయాలి. గుడ్లు పూర్తిగా ఉడికే వరకు కలుపుతూ వండాలి.

గుడ్డు వేగిన తరువాత నానబెట్టిన పోహా వేసి గుడ్ల మిశ్రమంతో బాగా కలపాలి. చివరగా కొత్తిమీర, నిమ్మరసం, వేయించిన పల్లీలు కలిపి తక్కువ మంటపై కొన్ని సెకన్లు ఉంచి దించాలి. ఇలా చేయడం వల్ల ఎగ్ పోహా తయారవుతుంది.